శత శాతం ఉత్తీర్ణత సాధించాలి : సర్పంచ్ బైరెడ్డి రమణ

సొంత ఖర్చుతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్

విశాలాంధ్ర-భోగాపురం : శత శాతం ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తేవాలని పదవ తరగతి విద్యార్థులను రెడ్డికంచేరు గ్రామ సర్పంచ్ బైరెడ్డి రమణ కోరారు. రెడ్డికంచేరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న 52 మంది పదవ తరగతి విద్యార్థులకు ఆయన సొంత ఖర్చుతో స్టడీ మెటీరియల్ అందించారు. 45 రోజుల్లో రానున్న పదవ తరగతి పరీక్షల్లో 52మంది కూడా ఉత్తీర్ణత సాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మంచు దెబ్బకు మాగిపోతున్న మామిడి పూతలు

లబోదిబోమంటున్న రైతులు

విశాలాంధ్ర-తెర్లాం : మామిడి తోటలు పూతలు విరజల్లే క్రమంలో గత వారం రోజులుగా దట్టమయినా మంచు కురవరడంతో మాగి పోతున్న పూతలు అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు మార్లు మందులు పిచికారి చేసి ట్రాక్టర్లతో ట్యాకర్లు పెట్టి చెట్లకు తడిపిన ఈ మంచు దెబ్బకు పూత పింజు కట్టకుండా మాగి పోతుంది అని, ఏంచేయాలో తెలియని పరిస్థితి అని మామిడి తోటలు పంటలు కౌలుకు తీసుకున్న రైతులు లబోదిబోమంటున్నారు. పెరుమాలి, కూనాయి వలస, తెర్లాం, నెమలం, ఉద్దవోలు, గ్రామాల రైతులు తెలిపారు.

రెడ్డి రమణ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ సహృద ఫౌండేషన్ వారు ఆదివారం నాడు మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెడ్డి రమణ మరణించిన విషయం విదితమే. వారి కుటుంబాన్ని ఆదుకోవాలనే మానవతా దృక్పధంతో, మానవీయత సంస్థ ఆధ్వర్యంలో అమెరికా కు చెందిన లిసహృదయలి లిఫౌండేషన్‌లి వారు రూ. 50,000లి/- ఆర్థిక సహకారం ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆసంస్థ అధ్యక్షులు తాడివాక బిందు, మనవీయత సంస్థ అధ్యక్షులు గోవిందరాజులకి రెడ్డి రమణ కుటుంబ సభ్యులు ధన్యవాదములు తెలిపారు, కార్యక్రమంలో ప్రభుత్వపాఠశాల ఉపాధ్యాయులు డోల నాగరాజు, ఎస్.వి.అప్పల నాయుడు, ఆశయ సంస్థ కార్యదర్శి మీసాల లక్ష్మణ, బూరాడ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి వాణిజ్య విభాగ అధ్యక్షునిగా తుమ్మల గుంటి బుజ్జి

విశాలాంధ్ర-గజపతినగరం : గజపతినగరం నియోజకవర్గం వైసీపీ పార్టీ వాణిజ్య విభాగ అధ్యక్షునిగా గజపతి నగరానికి చెందిన తుమ్మలగుంటి బుజ్జి నీ నియమించినట్లు మాజీ శాసనసభ్యులు అప్పల నరసయ్య శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వైసిపి పార్టీ 28 విభాగాల్లో నియమించిన వైసిపి నాయకులు బుజ్జిని నియమించామని పార్టీకి సంబంధించి ఏ విధమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాజీ శాసనసభ్యులు అప్పల నరసయ్య అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌పై సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో సంతోషం

- రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్,
- ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు ఉద్ఘాటన

విశాలాంధ్ర-విజయనగరం : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై నేడు దేశవ్యాప్తంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం విజయనగరంలో తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. కేంద్రం ఎంతో ధైర్యం చేసి ఆదాయ పన్నును రూ.12లక్షలకు పరిమితి పెంచిందని, ఇది ఎంతో ప్రశంసించాల్సిన అంశమన్నారు. జలజీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి సర్కార్ దీనిపై ప్రత్యేకదృష్టి సారించిందన్నారు. దీంతో బడ్జెట్‌లో 70వేల కోట్లు మంజూరు జరిగిందన్నారు. రాష్ట్రంలో అనేక గ్రామాలలో నేటికీ తాగునీటి సమస్యలు ఉన్నాయని, జలజీవన్ మిషన్ అమలుచేస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. 120 ప్రాంతాలలో ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం అంగీకారం తెలిపిందన్నారు. దీంతో రవాణా రంగం మెరుగవుతుందన్నారు. ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి సాయపడుతుందని తెలిపారు. స్కూల్ ఎడ్యుకేషన్ అభివృద్ధి చేసేందుకు 50వేల అటల్ లాబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారని, ఇది ఏపీకి ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రధానంగా తన శాఖకు సంబంధించి అనేక వరాలను ప్రకటించడం జరిగిందన్నారు. 100కోట్లు టర్నోవర్‌తో ఉన్న పరిశ్రమలను మీడియం ఇండస్ట్రీస్‌గా గుర్తించడం జరుగుతుందన్నారు. పోలవరంపై వైసీపీ సర్కార్ కనీసం పట్టించుకోలేదని, ఇప్పుడు పోలవరంతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నిధులు మంజూరు అవుతున్నాయంటే అది కూటమి సర్కార్‌పై కేంద్రానికి ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రవేటీకరణ అంశం లేదనే విషయం ఇప్పటికే తేటతెల్లమయిందన్నారు.

దావోస్ ఫలితాలు ఏదాదిలోపే చూస్తారు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన దావోస్ పర్యటన ఫలితాలను ఏడాదిలోగా చూస్తారని మంత్రి అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడమేకాకుండా చెడ్డపేరు తెచ్చారని, ఇవన్నీ తొలగించి రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేసేందుకు అనుభవజ్ఞుడైన చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో లోకేష్ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఎపి పరిశ్రమలకు ఎంత వరకు అనుకూలంగా ఉంటుందో పలు పలు పరిశ్రమల ప్రతినిధులకు వివరించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వాట్సాప్ గవర్నన్స్ విదానం రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ పాలన కారణంగా ఆర్థిక పరిస్థితి విధ్వంసంగా మారిందని, తాజాగా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అర్ధరహిత ప్రకటనలను ఖండించారు. ఈసమావేశంలో టీడీపీ నేతలు కె. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యతరగతి ప్రజలకు వరాలు కురిపించారు : ఎమ్మెల్యే

విజయనగరం అర్బన్ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు వరాలు కురిపించారని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. రూ. 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. జల్ జీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకు పొడిగించడం ద్వారా ప్రతి ఇంటికి 100 శాతం మంచినీరు అందించేవిధంగా చర్యలు తీసుకోవచ్చు అని అన్నారు. ఈ జల్‌జీవన్ మిషన్ పథకాన్ని గత వైకాపా ప్రభుత్వం పైపు లైన్ల ద్వారా గాలిని మాత్రమే పంపించారని, మన ఎన్డీయే ప్రభుత్వంలో నీటిని ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. నదుల అనుసంధానం చేయడం ద్వారా జల్ జీవన్ మిషన్ లక్ష్యాన్ని చేరుకోవచ్చని, అదేవిధంగా పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు కేటాయించడం మరియు రాజధాని అమరావతికి నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రానికి మంచి బ్రాండ్ ఏర్పడి పరిశ్రమలు, కంపెనీలు వస్తాయని అన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ప్రకటించిన ఈ బడ్జెట్ వికసిత్ ఆంధ్రప్రదేశ్ కు మార్గసూచికమని అభిప్రాయపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు నిధులు కేటాయించడం శుభసూచికం అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని బడ్జెట్ లో సూచించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు చేయుట కోసం పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం జరుగుతుందని, దీనివలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎంతో మెరుగవుతాయని అన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ద్వారా 100 గిగా వాట్స్ విద్యుత్ ను ఉత్పత్తి చేయడం ద్వారా అందరికి విద్యుత్ అందించడమే లక్ష్యమన్నారు. ఈబడ్జెట్ దేశ సమగ్రాభివృద్ధికి తోడ్పడుతుందని, అన్నిరంగాలలో దేశాన్ని అభివృద్ధి చేసి 100 సంవత్సరాల స్వాతంత్రం నాటికి వికసిత్ భారత్ ను నిర్మిస్తుందని శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు.

అక్రమంగా కలప తరలించుకుపోతున్న వాహనాలపై చర్యలు ఏవి?

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో అక్రమ కర్రల వ్యాపారస్థులు పక్కనే ఉన్న రాజం మండలానికి కలప రవాణా తరలించుకుపోవడంలో ఎటువంటి నిబంధనలు పాటించడం లేదు. రహదారిపై ట్రాక్టర్‌లతో కలప రవాణా ఇష్టారాజ్యం సాయింత్రం 7:00 గంటల నుంచి ఉదయం 5:00 గంటలలోపు వాళ్లకు నచ్చిన విధంగా కలప తరలించుకు పోతున్నారు. రామభద్రపురం టు రాజం జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఎక్కువగా వాహనాలు వెళ్తు వస్తున్నా క్రమంలో ఎన్నో యాక్సిడెంట్‌లు ఈ కలప రవాణా నచ్చిన విధంగా లోడ్ చేయ్యడం వలన వెనక వైపు ద్విచక్ర వాహనాలకు కానీ కార్‌లకు కానీ ఈ ట్రాక్టర్‌లతో ఉన్న కర్రల లోడ్ ఢీకొని ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోపోతున్నాయి అని ప్రయానికులు విలేకర్లతో వాపోతున్నారు. ఫారెస్ట్ అధికారులు కానీ ఇటువంటి అక్రమ రవాణా కలప తరలించుకు పోతున్న పట్టించుకోవడం లేదు అని ఆరోపణలు వెళ్ళువెత్తుతున్నాయి. ఇప్పటికయినా జిల్లా స్థాయి ఫారెస్ట్ అధికారులు దృష్టి పెట్టి, చెకపోస్టల వద్ద పహారపెట్టి నిబంధనలకు విరుద్దంగా అక్రమంగా ట్రాక్టర్‌లతో తరలించిన వారిపై చర్యలు తీసుకొని ప్రజలు ప్రాణాలు కాపాడాలని ప్రయాణం చేస్తున్న పలు వాహనదారులు కోరుకుంటున్నారు.

సాయి ఆర్థో ఆసుపత్రిలో ఫేషియల్ సర్జరీ

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఉన్న సాయి ఆర్థో ఆసుపత్రి లో ఇటీవల ముఖానికి సంబంధించి అరుదైన ఫేషియల్ సర్జరీ నిర్వహించారు. ఈ సర్జరీకి సంబంధించి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ఎ.శ్రీరామమూర్తి ఆదివారం సాయి ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనవరి 12వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయనగరం జిల్లా డెంకాడ మండలానికి చెందిన సత్యం అనే వ్యక్తి తమ ఆసుపత్రిలో చేరాడున్నారు. ఆయనకు ముఖం చిదిగిపోవడంతో ఫేషియల్ సర్జరీ ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.బాలసుందరరాజు, డాక్టర్ దకె.దినీషా సంయుక్తంగా శస్త్ర చికిత్స నిర్వహించి ఆయనను బ్రతికించడంతోపాటు ముఖానికి పూర్వపు రూపం వచ్చేలా చేయడం జరిగిందని వివరించారు. సుమారు రెండు లక్షల రూపాయలు ఖర్చు అయ్యే ఈ శస్త్ర చికిత్స ను సాయి ట్రస్ట్ ఆర్థిక సాయంతో కేవలం 50 వేల రూపాయల కే నిర్వహించడం జరిగిందన్నారు. ఇక మీదట ఫేషియల్ సర్జరీలు కూడా స్థానిక సాయి ఆసుపత్రి లో నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఫేషియల్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ బాల సుందర రాజు, డాక్టర్ కె.దినీషా పాల్గొన్నారు. శస్త్ర చికిత్స నిర్వహించిన ఇరువురు ఫేషియల్ సర్జరీ స్పెషలిస్ట్ లకు డాక్టర్ శ్రీరామమూర్తి సత్కరించారు.

డ్రైవర్ నిర్లక్ష్యం... పోయిన ప్రాణం

విశాలాంధ్ర-పూసపాటిరేగ : అసలే తెల్లవారుజాము నిద్రలేని ప్రయాణం, శీతాకాలం పొగ మంచు ఆ సమయంలో ప్రమాద కర ప్రయాణం ఇందులో డ్రైవర్ నిర్లక్ష్యం... అన్నీ కలిసి ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. పూసపాటిరేగ మండలంలో జాతీయ రహదారిపై కనిమెట్ట ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ముందు వెళుతున్న లారీని అదే దారిలో శ్రీకాకుళం నుంచి వైజాగ్ వెళుతున్న కారు ఢీకొట్టింది. స్థానిక ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్టణం వీ.ఎం.పాలెంకు చెందిన కింగువ రవి కుమార్ గాయత్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ తన కుటుబంతో కలిసి మహా కుంభమేళాకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇందులో అతని భార్య బోగి సౌజన్య(45) అక్కడికక్కడే చనిపోయిందని, తమ అత్త బోగి బావని, అతని పిల్లలు హృదయ్, అనుష్కకు చిన్నపాటి దెబ్బలు తగిలి అతనికి కాలు విరిగిపోయిందని, సంఘటన జరిగిన వెంటనే 108లో విజయనగరం తిరుమల హాస్పటిల్‌కి తీసుకువెళ్లారని తెలుసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం : భీశెట్టి బాబ్జీ

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : వికసిత భారత్‌లో పేదరికం ఉండకూడదని చెపుతూనే ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్న ఆర్థిక సవాళ్ళను అధిగమించి నడవాలని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం లోక్‌సభలో 2025-26 సంవత్సరంకి గాను 50,65,345 కోట్ల రూపాయలతో ప్రవేశపెట్టిన బడ్జెట్ స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యంకి అనుగుణంగా ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. నిర్మలా సీతారామన్ గురజాడ రాసిన మాటను లోకసభలో ప్రస్తావించడం సంతోషం కలిగించిందన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అనేక సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించవలసినవి ఉన్నాయని, విశాఖపట్నం ఉక్కు కర్మాగారంకి నేటికీ సొంత ఘనులు లేవని అందుకే నిత్యం నష్టాల్లో ఉంటుందని,వాల్తేరు డివిజన్ కోసం కనీస ప్రస్తావన లేదని, గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయింపులు లేవని, జాతీయ స్థాయిలో రక్షణ, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, విద్యా రంగాలకు పుష్కలంగా నిధులు కేటాయించి, ఆరోగ్య రంగానికి 98,311 కోట్లే కేటాయించడం సరికాదని అన్నారు. ట్యాక్స్ పరిమితుల మధ్యనే అందరినీ మెప్పించే ప్రయత్నం చేసారని,దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా ఆసుపత్రుల్లో వచ్చే మూడేళ్లలో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం మంచిదని దీనివలన పేద ప్రజలకు క్యాన్సర్ వైద్యం అందు బాటులోకి వస్తుందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా సహకార సంఘాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పి బడ్జెట్‌లో అదే అంశాన్ని వదిలేశారని భీశెట్టి ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ఎంపీలు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చెయ్యాలని భీశెట్టి కోరారు. ఈ సమావేశం భీమసింగి సుగర్స్ కార్మిక నాయకులు ఉంగరాల శ్రీనివాసరావు, రౌతు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షునిగా రమణ

విశాలాంధ్ర-బొండపల్లి : మండలంలోని గొట్లాం గ్రామానికి చెందిన మహేందర్ నియోజకవర్గ వైసిపి గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా నియమిస్తూ ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే అప్పల నరసయ్య శనివారం ప్రకటించారు. 28 విభాగాల్లో రమణకు ఈవిభాగం బాధ్యతలు అప్ప చెప్పినట్లు తెలిపారు. రమణకు మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్. అప్పల నరసయ్యులు అభినందించారు పార్టీ బలోపేతం చేస్తూ ప్రజలకు గ్రీవెన్స్‌లో సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఎస్ఐ తీరుపై విచారణకు ఆదేశం : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఎం.ఎల్.సి. ఎన్నికల కోడ్ ను ఆంధ్ర ఎస్సై ఉల్లంగించినట్లుగా వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కొంతమంది రాజకీయ నాయకులను ఆంధ్ర ఎస్సై కే.సీతారాములు కలిసినట్లుగా వచ్చిన ఆరోపణలపై బొబ్బిలి డీఎస్పీ డి.భవ్య రెడ్డిని విచారణ చేసి, నివేదిక పంపాలని ఆదేశించామన్నారు. విచారణలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లుగా వచ్చిన ఆరోపణలు నిర్ధారణ అయితే నిబంధనలు మేరకు ఎస్సైపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.

ఇంగ్లీష్ టాలెంట్ టెస్ట్‌లో కుమరాం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-జామి : జిల్లాలోని బొబ్బిలి ఆర్‌విఆర్ఎస్ రాజా కళాశాలలో జరిగిన ఇంగ్లీస్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని కుమరాం జిల్లా పరిషత్ విద్యార్థినిలు ఎం.ఉషశ్రీ, జి.షైనీ సుసన్నాలు ప్రతిభ కనబర్చారు. రెండు జిల్లాలకు చెందిన దాదాపు 500మంది విద్యార్థులు ఈపోటీలలో పాల్గొనగా మొదటి పది స్థానాల్లో కుమరాం హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. ఈమేరకు గైడ్ టీచర్ గుండాల శ్రీనివాసరావును, విద్యార్థులను పాఠశాల హెచ్ఎం సిహెచ్. పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

డిక్షనరీలు, ఇతిహాస పుస్తకాలను వడ్డారి కృష్ణరాజేశ్వర్ అందజేత

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : జిల్లా గ్రంథాలయ సేవా సంఘాన్కి ఎస్‌బీఐ ఉద్యోగి వడ్డారి క్రిష్ణ రాజేశ్వర్ పుస్తకాలను ఆదివారం అందించావారు. ఇందులో ఆధ్యాత్మికతతో, పోటీ ప్రవేశ పరీక్షలు, ఇతిహాస పుస్తకాలు డిక్షనరీలు, కవులు, రచన, మ్యాగ్జిన్లు అందించారు. వారి స్వహస్తాలతో అందంచిన పుస్తకాలు స్వీకరణలో గ్రంథాలయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుల ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, సంఘం అధ్యక్షుడు ఎర్నాయుడు, సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్రషీద్ కార్యకర్త, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 4ఎస్ రాజు మాట్లాడుతూ తీసుకున్న పుస్తకాలు విద్యార్థులకు అందజేశామని పుస్తకాలు నిరంతర ప్రక్రియ కార్యక్రమం అని అన్నారు.

చీపురుపల్లిలో నల్లబజార్‌కి తరలుతున్న స్టాంపులు!

- స్టాంపు విక్రయదారులు మూకుమ్మడిగా విక్రయాలు నిలిపివేత
- రెట్టింపు ధరలు ఇస్తే స్టాంపు విక్రయం, లేదంటే నో స్టాక్
- సర్వర్ పని చేయలేదని వినియోగదారులకు బెదిరింపు
- ఈ స్టాంపు విక్రయాలపై మాకు అధికారం లేదన్న సబ్ రిజిస్టర్

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణంలో గత కొద్ది రోజుల నుంచి ప్రభుత్వం నుండి పొలైసెంట్స్ పొందిన స్టాంప్ వెండర్లు కొమ్మక్కై ఒకేసారిగా స్టాంపులు విక్రయాన్ని నిలిపివేశారు. దీంతో స్టాంపులు కొనుగోలు కోసం చీపురుపల్లి పట్టణానికి సమీపంలో ఉన్న సుమారు 100 గ్రామాలకు చెందిన ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు... చీపురుపల్లిలో సుమారు 9 మంది స్టాంప్ వెండర్ లో ఉన్నప్పటికీ గత శుక్రవారం శనివారం రెండు రోజులుగా ఏఒక్క స్టాంపు వెళ్లారు. స్టాంపులను ప్రజలకు విక్రయించకుండా విక్రయాలు నిలిపివేశారు. చీపురుపల్లిలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా లేనివిధంగా పది రూపాయలు షాంపును 30 నుంచి 40 రూపాయలకు, 20 రూపాయల స్టాంపులు 50 నుంచి 70 రూపాయలకు, వంద రూపాయలు స్టాంపును 150 నుంచి 200 రూపాయలకు విక్రయిస్తున్నారు. చీపురుపల్లిలో సబ్ రిజిస్టర్ కార్యాలయమునకు పది అడుగుల ముందునే స్టాంపు వెండారు పైవిధంగా అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తున్నప్పటికీ చర్య తీసుకోవలసిన సబ్ రిజిస్టర్ మీనమేషాలు లెక్కిస్తున్నారు. చీపురుపల్లిలో స్టాంపు విక్రయదారులు అడిగిన పైకి ఏమో చెల్లిస్తే స్టాంపును విక్రయిస్తున్నారు. అధిక ధరలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్న వినియోగదారులకు మాత్రం సర్వర్ పనిచేయడం లేదని ఒకసారి, స్టాంపులు నిల్వలేదని మరోసారి ఇలా షాపులు చెబుతూ ప్రభుత్వ సరఫరా చేసిన స్టాంపులను నల్లబచారులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారులు తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న తీరు స్థానికంగా చర్చిని అవసరం అయింది... ఎంతో ప్రాచీనమైన, పేరుగాంచిన చీపురుపల్లి పట్టణంలో గతంలో ప్రభుత్వ నిర్దేశించిన ధరలకే స్టాంపులు అందుబాటులో ఉండేవి... ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలవలన, పాఠశాల కళాశాల విద్యార్థులకు భర్త సర్టిఫికెట్ అవసరమై అధిక మొత్తంలో స్టాంపులను డిమాండు ఏర్పడింది. విద్యార్థుల డిమాండ్ అవసరాన్ని ఆసరాగా తీసుకున్న చీపురుపల్లి స్టాంప్ వెండర్లు సంబంధిత అధికారుల ఎదుటనే అధిక ధరలకు స్టాంపులను విక్రయించి తమ జేబులు నింపుకున్నారు. గత శుక్ర, శని వారాలలో చీపురుపల్లి పట్టణంలో స్టాంపులు అందుబాటులో లేకపోవడం, వండర్లు మూకుమ్మడిగా స్టాంపులు విక్రయాన్ని నిలిపివేయడంతో స్టాంపులు కొనేందుకు వచ్చినా వినియోగదారులు స్థానిక సబ్ రిజిస్ట్రార్నకు, జిల్లా రిజిస్ట్రార్నకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సుధీర ప్రాంతాల నుంచి ఎంతో ప్రయాసనకు తట్టుకొని స్టాంపు కొనుగోలు కోసం చీపురుపల్లి వచ్చిన వినియోగదారులకు భంగపాటు తప్పలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో స్టాంపులు అవసరమైన ప్రజలు వినియోగదారులు రాజాం, విజయనగరం రంగస్థలం పోవాల్సిందే తప్ప, మరొక ప్రత్యామ్నాయం లేదని వాపోతున్నారు. ఎక్కడా లేనివిధంగా ఒక్క చీపురుపల్లి పట్టణంలోనే, అది సబ్ రిజిస్టర్ ఎదుటనే అధిక ధరలకు స్టాంపులు విక్రయిస్తున్నప్పటికీ చర్య తీసుకోవలసిన అధికారులు తీరు పట్ల పలు విమర్శలు వెల్లి వెతుతున్నాయి... స్టాంపులు అత్యవసరమైన వారు స్టాంప్ వెండర్లు డిమాండ్ చేసిన అధిక మొత్తము చెల్లించి స్టాంపులను దొడ్డి దారిన కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్ రిజిస్టర్ వివరణ : చీపురుపల్లిలో గత శుక్ర, శని వారాలలో స్టాంపులు అందుబాటు లేకపోవడంపై సబ్ రిజిస్ట్రార్ ఎస్‌విఎల్ఎన్ లక్ష్మణరావుని వివరణ కోరగా స్థానికంగా ఉన్న స్టాంపు వెండార్లను పిలిపించి తగు చర్య తీసుకుంటామని, ఈ స్టాంపు విక్రయదారులపై చర్య తీసుకునే అధికారం తమకు లేదని, ఆయన వివరణ ఇచ్చారు.

ఫీజు పోరు పేరుతో ధర్నాకు జగన్ పిలుపు సిగ్గుచేటు

విశాలాంధ్ర-రాజాం : వైసిపి ప్రభుత్వంలో రూ 2000 కోట్లు పెండింగ్ బకాయిలు పెట్టి విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిదని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ విజయనగరం జిల్లా సెక్రెటరీ మండల రాము ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారుల్లోకి వచ్చిన 8 నెలలకే రూ 788 కోట్ల విడుదల చేసి 9 లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఉనికి కోసమే ఫీజు పోరు కార్యక్రమం చేపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

తెలుగు-వెలుగు నంది పురస్కారాలకు చీపురుపల్లి సతీష్ ఎంపిక

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన చీపురుపల్లి సతీష్ (కీబోర్డు కళాకారులు) సంగీతం, కీబోర్డు కళా రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు ఆయనను అభినందిస్తూ తెలుగు వెలుగు నంది పురస్కారము-2025ను ప్రధానం చేశారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆయనకు సన్మాన కార్యక్రమం జరిగిందన్నారు. డా.మండలి బుద్ధ ప్రసాద్, మాజీ శాసనసభ డిప్యూటీ స్పీకర్, శాసనసభ్యులు, అవనిగడ్డ చేతులమీదుగా సన్మానం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జన్మ ఎత్తినందుకు ఎంతో కొంత సార్థకత ఉండాలి, ఏదో సాధించాలి, తాను కొందరికైనా మార్గదర్శకంగా ఉండాలని ఏ కొందరిలోనో ఈ తపన ఉంటుందని, అలాంటి వారే చరిత్రలో నిలిచిపోతారు. అటువంటి ఆణి ముత్యాలాంటి అతిరథ మహారథులు హేమాహేమీలైన మీ పత్రిభా పాటవాలను కృషిని ప్రశంసిస్తూ మీరూ ఇంకా ఎన్నో అద్భుతాలను విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తూ చదువుల తల్లిగా పేరు గాంచిన బాసర జ్ఞాన సరస్వతి దేవి ఆశీస్సులు మీపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నానని ఆయన అన్నారు. సన్మాన గ్రహీత చీపురుపల్లి సతీష్‌ను తోటి కళాకారులు గ్రామస్తులు స్నేహితులు అభినందించారు.

విశాలాంధ్ర
విజయనగరం
పేజి : 2
సోమవారం 3, ఫిబ్రవరి 2025

మద్యం మత్తులో లారీ డ్రైవర్... తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-రాజాం : రాజాం అంబేద్కర్ సెంటర్లో ఆదివారం ఉదయం లారీ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. మద్యం మత్తులో పాలకొండ రోడ్డు నుండి అతి వేగంగా రాంగ్ రూటులోకి పెట్రోల్ బంక్ వైపు దూసుకొచ్చాడు. దీంతో అటువైపు వస్తున్న వాహనదారులు భయపడి వాహనాలు నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్ ను వెంటనే స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు డ్రైవర్ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

117 జీఓ రద్దు చేస్తూ జారీ చేసిన మెమో ప్రకారం హేతుబద్ధీకరణ చేయాలి : ఏపిటిఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : పాఠశాల విద్యకు తీవ్ర నష్టాన్ని కలిగించిన 117 జి ఓ కు సవరణగా జారీచేసిన మెమో ప్రకారంపాఠశాలల హేతుబద్ధీకరణ జరగాలని ఏపిటిఎఫ్ డిమాండ్ చేస్తున్నదని ఆ సంస్థ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు అన్నారు. ఆదివారం బొబ్బిలి డివిసిన్‌లో ఉన్న ఏపిటిఎఫ్ శ్రేణులతో అత్యవసర సమసవేశాన్నీ ఏపిటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 117 జిఓ రద్దు-సవరణలతో జారీచేసిన మెమో అమలు అనే అంశంపై నాయకులు చర్చించి తీర్మానాలు చేశారు. ఈ నేపథ్యంలో జె సి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం మెమోలో చెప్పింది ఒకటి, చేస్తున్నది మరొకటిలాగా ఉందన్నారు. విద్యాశాఖ రాష్ట్ర అధికారులు దిగువ స్తాయి అధికారులకు మెమోకు భిన్నంగా ఆదేశాలు జారిచేస్తున్నారని అన్నారు. 117వ జిఓ పాఠశాల విద్యాలో ఎంత నష్టాన్ని చేసిందో దానికి ప్రత్యామ్నాయంగా జరుగుతున్న ఏర్పాట్లు మరింత నష్టాన్ని చేకూర్చే విధంగా ఉన్నాయని ఆయన అన్నారు. మెమోలో పేర్కొన్న ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 60కి మించి ఉన్న పాఠశాలలను ఉన్నతీకరించాలని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60మించిఉంటే ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగామార్పు చేయాలని మెమోలో సూచించారని, దానికి భిన్నంగా వసతులు లేవని ఏదో ఒక కారణం చూపుతూ పాఠశాలలను విలీనం చేస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్య 60 నుండి 45కు తగ్గించి మోడల్ ప్రైమరీ పాఠశాలలను రూపకల్పన చేస్తే అధికంగా విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. 30 నుండి 59 వరకు విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరారు. జిల్లా కార్యదర్శి సింహాచలం మాట్లాడుతూ 1, 2 తరగతులతో కూడిన ఫౌండేషన్ పాఠశాల వ్యవస్థను తొలగించివిద్యార్థులు 60పైన ఉన్నవాటిని మోడల్ ప్రైమరీ పాఠశాలలు గాను 60 లోపు ఉన్న పాఠశాలలను కూడా 1 నుండి 5 తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు పిపి 1, పిపి 2లను అనుసంధానం చేసి ఉపాధ్యాయులను నియమించి కొనసాగించి ప్రభుత్వం పాఠశాల విద్యను పటిష్ట పరచాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షులు జోగినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యలో ప్రవేశపెట్టాలని భావిస్తున్నసంస్కరణలు విద్యార్థులకు నాణ్యమైనవిద్యను అందించేవిగా ఉండాలని, పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉండాలని ఏ కోపాధ్యాయ పాఠశాలలో లేకుండా ఆపాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని అన్నారు. సమావేశంలో సిహెచ్ జె ప్రవీణ్ కుమార్, కుందా శ్రీను, రామకృష్ణ, ఎల్లయ్య, ప్రసాద్, శర్మ, జె బి దర్శనం, బండి రమేష్, లక్ష్మణరావు వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవు : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఫిబ్రవరి 2న మందుబాబులను హెచ్చరించారు. ఇందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించాలని, వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీగారు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో పోలీసు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణాలు, గ్రామాల్లోని లే-అవుట్లు, శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న 250 మంది మందుబాబులపై కేసులు నమోదు చేసారు అదే విధంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది తమ పోలీసు స్టేషను పరిధిలోని ముఖ్య కూడళ్ళ వద్ద వాహన తనిఖీలు చేపట్టి, వాహనదారులకు రహదారి భద్రత, హెల్మెట్ ధారణ పట్ల అవగాహన కల్పించారు. ఎం.వి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఫిబ్రవరి 1న 393 కేసులను నమోదు చేసి, ఈ-చలానగా రూ.1,20,640/- లను విధించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఈప్రత్యేక డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ డి.భవ్య రెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, సంబంధిత సీఐలు, ఎస్సైలు ప్రత్యేక డ్రైవ్లో పాల్గొని, దాడులు నిర్వహించారని తెలిపారు.

నేటితరం విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం

విశాలాంధ్ర-బొబ్బిలి : రాష్ట్ర ఆంగ్లభాషోపాధ్యాయ సంఘం (డెల్టా) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 15వ ఆంగ్ల భాష ప్రతిభ పాటవ పోటీలను డెల్టా అధ్యక్షుడు ఎం విజయ మోహన్ రావు ఆధ్వర్యంలో రాజా కళాశాలలో నిర్వహించారు. పరీక్షా ప్రశ్నపత్రాలను డెల్టా వ్యవస్థాపకులు మింది గుంప స్వామి, రౌతు రామ్మూర్తి,, బొత్స సత్యనారాయణ, నంబియార్ వేణుగోపాలరావు, మండల ఎంఈఓ జి.వాసు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కే.మోహన రావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ యుగంలో విద్యార్థులు కేవలం పాఠశాల పరీక్షలనే కాకుండా కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కూడా హాజరు కావాలని కోరారు. గత 15 సంవత్సరాలుగా డెల్టా ఆధ్వర్యంలో ఇంగ్లీష్ టీచర్లు కలిసి విద్యార్థుల కోసం ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లోఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం అత్యంత ఆవశ్యకమని చెప్పారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ ఏ గ్రేడ్ సాధించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలకు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతిపురం మన్యం జిల్లాల నుండి అత్యధికంగా 347 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి ఆంగ్ల భాష పాఠ్యాంశాలపై పరీక్ష నిర్వహించారు. ఇందులో విజేతలు ఎస్. జ్యోత్స్న (జిల్లా ప్రజా పరిషత్, గుణాన పురం..కొమరాడ మండలం), ఏ.ధరణి, (జిల్లా ప్రజా పరిషత్ నారన్నాయుడువలస బలిజి పేట మండలం), జి.హేమంత్ కుమార్ (జిల్లా ప్రజా పరిషత్ అధికారి తె ర్లాం) ప్రథమ,ద్వితీయ, తృతీయ సాధించగా మొత్తం 20 స్థానాలకు విజేతలను ఎంపిక చేశారు. విజేతలందరికీ నగదు బహుమతి, జ్ఞాపికలు గ్రామర్ పుస్తకాలు ప్రశంసా పత్రాలు అందజేశారు. పాల్గొన్న ప్రతివారికి మెమోంటోలు, ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సుమారు 46 మంది ఇంగ్లీష్ టీచర్లు పాల్గొన్నారు. బొత్స రత్నకిషోర్ జి.రోజారమణి, బి పరమేశ్వరరావు, ఎం రామకృష్ణ, కే సత్యనారాయణ, జి మహేష్, పి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు అందరికీ స్నాక్స్ మరియు భోజన సదుపాయాన్ని శాసనసభ్యులు బేబీ నాయన సమకూర్చడం పట్ల డెల్టా టీచర్లు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రానికి మొండిచేయి చూపిన బడ్జెట్‌కు నిరసన తెలపాలి

ప్రజలకు సిపిఎం విజ్ఞప్తి

విశాలాంధ్ర-బొబ్బిలి : కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు అడియాసలు చేసింది. కేంద్ర బీజేపీ మరోసారి చేసిన ఈ ద్రోహానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని విజ్ఞప్తి చేశారు.బడ్జెట్లో ఏపీకి కేంద్రం మళ్ళీ మొండి చేయి చూపించింది. ప్రత్యేక హెూదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, వంటి విభజన హామీలు పక్కన పెట్టింది. విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థకు కేటాయింపులు చేయలేదు. విశాఖ రైల్వేజోన్,ఎన్ఐటి, ఐఐటీ,ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ఐఐఎస్ఇఆర్, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగరాజుపట్నం పోర్ట్, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, వెనుకబడిన జిల్లాలకు నిధులు, రాజధాని నిర్మాణానికి నిధులు, ఊసేలేదు. రాజధాని నిర్మాణానికి గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంకు రుణాన్ని పదే పదే ప్రస్తావించారు. తప్ప కొత్తగా కేటాయింపు లేదు. గత బడ్జెట్లో రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలను వెనుకుబబడిన ప్రాంతాలుగా గుర్తించిన ఒక్క పైసా ఇవ్వలేదని. ఈ బడ్జెట్ లో వాటి ఊసుకూడా లేదు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి చేసిన కూడా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని. ఈ దగాకోరు బడ్జెట్ ను ప్రజలు వ్యతిరేకించాలని. మరోవైపు వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు గత ఏడాది రూ 8.622 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్లో 3.295 కోట్లు కేటాయించింది. అంటే గత ఏడాది కంటే బడ్జెట్లో రూ: 5.327 కోట్లు తగ్గించిందని అన్నారు. ఆర్భాటంగా ప్రకటించిన రూ. 11,440 కోట్ల ప్యాకేజీ ప్రస్తావన లేదని. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల గురించి మాట్లాడకపోవడం మోసం చేయడమే విభజన హామీలలో భాగంగా కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ ని గాలికి వదిలేసింది. పోలవరం ప్రాజెక్టుకు గత ఏడాది రూ: 5.512 కోట్లు కేటాయిస్తే ఈసారి 5,539 కోట్లు కేటాయించిందని అన్నారు.

నిరుద్యోగ యువతకు, రైతాంగానికి పెద్దపీట వేస్తా..!

- తాను పుట్టిన నేలను అభివృద్ధి చేస్తా
- దారి పొడవునా పూల వర్షం కురిపించిన గ్రామస్తులు
- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు
- జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజేష్‌వర్మ

విశాలాంధ్ర-గుర్ల : జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతకు వ్యవసాయ రైతన్నకి పెద్దపీట వేస్తానని జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ అన్నారు. ఆదివారం పల్లి గంద్రేడు గ్రామంలో అభినందన సభ ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కొండగంద్రేడ్ గ్రామం నుంచి దారి పొడుగునా గ్రామంలోకి పూల వర్షం కురిపించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన సొంత గ్రామం రావడంతో గ్రామస్తులు భారీ స్థాయిలో హాజరయ్యారు తాళమేళాలతో ముందుగుండు సామగ్రితో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. గ్రామస్తుల అందరూ సాలువలతో పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మారుమూల గ్రామంలో ఉన్న పల్లి గెంరేడు గ్రామం నుంచి తనకు జిల్లాస్థాయిలో జాతీయ స్థాయి పార్టీలో తనకు అవకాశం కల్పించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను అన్నారు ముఖ్యంగా తాను జన్మించిన గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి తీరుతానన్నారు జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువత కోసం రైతన్న కోసం పూర్తిస్థాయి నిధులు కల్పించే విధంగా వారికి ఉపాధ్యాయ కల్పించే విధంగా చూస్తానన్నారు వీటిపై జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మంత్రులతోను ఎమ్మెల్యేలతోనూ పాటు కేంద్రంలో పెద్దలు దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధికి నిధులు కేటాయించి విధంగా చూస్తాను అన్నారు ఈ కార్యక్రమంలో మండల స్థాయి భారతీయ జనతా పార్టీ నాయకులు గ్రామస్థాయి నాయకులు గ్రామస్తులు వివిధ గ్రామాల నాయకులు హాజరయ్యారు.

అనారోగ్య బాధితులకు రూ.20 వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడ గ్రామానికి చెందిన ముగ్గురు అనారోగ్య బాధితులకు గ్రామానికి చెందిన మన ఊరు మన నేస్తం గ్రూప్ సభ్యులు రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు.గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు వారి అనారోగ్య తీవ్రతను బట్టి కడారి అప్పారావుకి శరీరంలో నరాలు సక్రమంగా పనిచేయక పెరాలసిస్ లాంటి ఒక రకమైన వ్యాదితో బాధపడుతూ నడవలేని స్థితిలో మంచం మీద ఉన్నారు.ఇతనికి రూ.10 వేలు, మాదేటి సాయితేజకి ముక్కు లోపల ట్యూమర్ వచ్చి శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైజాగ్ గాయత్రి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు.సాయి తేజ ప్రస్తుతం గ్రామంలో లేనందున రూ.5వేలు గ్రూపు సభ్యులు కర్రి బుచ్చిబాబుకి అందజేశారు. అలాగే గొర్లి సూర్యనారాయణకి కాలు ఫ్యాక్చర్ అవడం వలన సెప్టిక్ అయి నడవలేని స్థితిలో ఉండడం వలన రూ.5వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో శిరికి సాయి,పట్రాన శంకర్, నిరుజోగి జోగారావు, శానాపతి దేముళ్ళు,కర్రి బుచ్చిబాబు, శానాపతి అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

శిల్పరామంలో ఆకట్టుకున్న జానపద గీతాలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : శిల్పారామం విజయనగరం వ్యసనారాయణ మెట్ట (నల్లచెరువు) వారాంతపు కార్యక్రమాలులో బాగంగా ఆదివారం సాయంత్రం 5 గం. నుండి దప్పు శ్రీను అభ్యుదయ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు జానపదగీతాలు కామిడికిట్స్ ప్రదర్శించారని రమణ అన్నారు. కావున విజయనగరంలోని పట్టణ ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పోలమాంబ ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి హాజరు

విశాలాంధ్ర-బాడంగి : బాడంగిలో నూతనంగా నిర్మించిన బాడంగి గ్రామదేవత పోలమాంబ ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం బొబ్బిలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజర య్యారు. ముందుగా పోలమాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పెద్దింటి రామారావు, సర్పంచ్ కండి రమేష్, ఎంపిటిసి దేవరపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అంబటినాయుడు, అంబటి గణపతి, శ్రీనివాసరావుతో పాటు నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బేతనపల్లి శంకర్రావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వార్షిక బడ్జెట్‌తో ఉద్యోగ, వ్యాపార వర్గాలు హర్షం

ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

విశాలాంధ్ర-సంతకవిటి/రాజాం : సంతకవిటి మండలం కొండగూడెం గ్రామంలో చల్లా శ్రీరాములు కుమారుడు వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆశీర్వదించారు. అనంతరం భవిష్యత్ కార్యచరణపై నియోజకవర్గం నాయకులతో కలిసి చర్చించారు. అలాగే కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ ఆశాజనకంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రమ ఫలించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్, విశాఖ పోర్టుకు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.ఏపీ ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ.162 కోట్ల కేటాయించడంతో పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉందన్నారు.సీసీ రోడ్లు,వంతెనల ప్రాజెక్టులు, ఇరిగేషన్‌కు నిధులు కేటాయించడం సంతోషదాయకమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో అన్ని రంగాలకు న్యాయం చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు.వైద్య కళాశాలల్లో సీట్లను పెంచడం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి దోహదపడు తుందన్నారు. ఐటీ పరిమితి పెంపుపై ఉద్యోగ.వ్యాపార వర్గాలలో హర్షం వ్యక్తమవుతోందన్నారు. గతంలో ఆదాయ పన్ను గరిష్ఠ పరిమితి రూ.7లక్షలు, స్టాండర్డ్ డిడక్షన్ రూ.75వేలు ఉండగా ప్రస్తుతం పరిమితిని రూ.12లక్షలు పెంచడంతోపాటు స్టాండర్డ్ డిడక్షన్ ను కొనసాగిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో వేతన జీవులకు పెద్ద ఊరట కలిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ తూర్పు కాపు కార్పోరేషన్ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు తదితర నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ తలే రాజేష్

విశాలాంధ్ర-రాజాం : రాజాం మున్సిపాలిటీ పరిధి బుచ్చంపేట గ్రామంలో ముద్దాడ వారి రజస్వల కార్యక్రమంలో పాల్గొని చి"గాయత్రి నీ ఆశీర్వదించిన రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా. తలే.రాజేష్ ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ పాలవలస.శ్రీనివాస రావు, వైఎస్ఆర్సీపీ నాయకులు పిట్ట.జగదీశ్, శేశపు.వేణు నాయుడు, డా. బి.నరేంద్ర, కోరాడ.రామినాయుడు మరియు గ్రామ వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు

విశాలాంధ్ర-రాజాం : రాజాం పాలకొండ రోడ్ అంబేద్కర్ జంక్షన్ లో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, పత్రాలు లేని వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఎస్సై వై.రవి కిరణ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ రాస్తారోకో

విశాలాంధ్ర-గజపతినగరం : దేశవ్యాప్తంగా పిలుపులో భాగంగా ఆదివారం గజపతినగరంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి శ్రీనివాస్ మెంటాడ మండల కన్వీనర్ రాకోటి రాములు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలం అని కార్మిక కర్షక పేద ప్రజలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. అలాగే మన రాష్ట్రానికి జిల్లాకి తీరని ద్రోహం జరిగిందని తెలిపారు. కార్పొరేట్లకు ఆస్తి పర వర్గాలకు పనులు తగ్గించారు పేద మధ్యతరగతి వర్గానికి సంక్షేమానికి కోతలు దించాలని గ్యాస్ ఎరువులకు ఆహార సబ్సిడీలకు బడ్జెట్ లో కుదింపు తగ్గించారని టెలికం విద్యుత్తు టూరిజం టెక్నాలజీ రంగాలకు కార్పొరేట్ దిగ్గజాలకు వరాలు కురిపించారు. ఇచ్చిన హామీలు నీటి మూటలు అయ్యాయని మన జిల్లాలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణం అత్యంత నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. మోడీ పాలనలో బడ్జెట్ మోసాన్ని ప్రజలు ఎదిరించి హక్కులను బడ్జెట్లను ఆయా రంగాల ప్రజలు పోరాడి సాధించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కనకరాజు గోవింద సూర్యనారాయణ శ్రీను కృష్ణ తదితరులు పాల్గొన్నారు

శ్రీసాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందన సత్కారం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : శ్రీసాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న శ్రీసాయి కృష్ణా వాకర్స్ క్లబ్ నడకమైదానంలో క్లబ్ సభ్యులు, జిల్లా పౌర సరఫరాల శాఖ ఉద్యోగి కొడుకుల రమేష్ కు గణతంత్ర దినోత్సవం నాడు జిల్లా కాలెక్టర్ చే ఉత్తమ విధినిర్వహణ సేవలకు అందుకున్న గౌరవానికిగాను క్లబ్ సభ్యులంతా అభినందిస్తూ ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా క్లబ్ గౌరవ సలహాదారులు, ఎలక్ట్ గవర్నర్ ఎ.తిరుపతిరావు మాట్లాడుతూ చేసిన నిస్వార్ధ సేవలకు గుర్తింపు లభిస్తుందని, పురస్కారాలు, ప్రశంసలు మరింత భాధ్యతను పెంచుతాయని, కొడుకుల రమేష్ ను విధినిర్వహణలో నిబద్ధత తో చేసిన విశిష్ట సేవలను క్లబ్ సభ్యులంతా కొనియాడారు. క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ గౌరవ పెద్దలు పిన్నింటి సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, క్లబ్ కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, కోశాధికారి ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు తదితర సభ్యులు భారీగా పాల్గున్నారు.

ఆర్యవైశ్యులకు రక్షణ కల్పించాలంటూ సంఘ నాయకులు రిప్రజెంటేషన్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఇటీవల కాలంలో ఆర్యవైశ్యులపై జరుగుతున్న వరుస దాడులను వ్యతిరేకిస్తూ ఆర్యవైశ్యులకు రక్షణ కల్పించాలంటూ ఎస్ కోట పోలీస్ స్టేషన్ వారికి వినతి పత్రాన్ని అందించినటువంటి ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు. నెల రోజుల రోజుల వ్యవధిలో ఎస్.కోట పుర షావుకారి జంక్షన్ వద్ద సాయికుమార్ ఇంటి వద్ద జరిగినటువంటి ఫైర్ ఆక్సిడెంట్ మరియు ఆర్యవైశ్యుల షాపులపై జరిగిన దొంగతనాలు అదేవిధంగా వన్ వే ట్రాఫిక్ వద్ద రాజు కిరాణా షాపు వద్ద మందుబాబులు షాపును ధ్వంసం చేసినటువంటి ఘటన వీటన్నింటిపై పోలీసులు సరైన చర్యలు తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఇకపై ఆర్యవైశ్యులకు స్వేచ్ఛగా స్వతంత్రంగా ప్రశాంతమైన వాతావరణంలో వ్యాపారం చేసుకునే విధంగా రక్షణ కల్పించాలంటూ పోలీసు వారిని ఆర్యవైశ్య యువజన సంఘం ఎస్ కోట వారు కోరడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.కోట దేవి జంక్షన్ వద్ద నుండి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ఆర్యవైశ్యులు నడుచుకుంటూ వెళ్లి పోలీస్ స్టేషన్లో వినతిపత్రాన్ని అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఎస్ కోట అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ హెచ్ నానాజీ వర్తక సంఘం అధ్యక్షులు కొల్లా శ్రీనివాసరావు ఉపాధ్యక్షులు కొల్లా వెంకటేష్, ఆర్య వైశ్య ప్రముఖులు తోట వాసు కొనగల్ల శ్రీను, చెక్క కిరణ్ కాపుగంటి వాసు పోట్నూరు సాయిరాం , యువజన విభాగం అధ్యక్షుడు ఉప్పల విజయకుమార్ ఉపాధ్యక్షులు విజ్జపు సతీష్ వాసవి క్లబ్ ప్రతినిధులు ముప్పడం శివ కుమార్ వేమూరి శ్రీనివాస్ బాలనాగు శ్రీనివాస్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో దూరంలో ఉన్న వృద్ధురాలికి పింఛన్ అందజేత

విశాలాంధ్ర-జామి : మండల కేంద్రమైన జామికి చెందిన బొట్ట పైడితల్లి అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ తన కుటుంబసభ్యులు ఉన్న డెంకాడ మండలంలోని పెదతాడివాడలో నివాసం ఉంటుంది. ఆమె ప్రస్తుతం మంచానికి పరిమితమైన నేపథ్యంలో ఈనెల పింఛన్ తీసుకునేందుకు రాలేకపోయింది. ఈవిషయాన్ని తెలుసుకున్న జామికి చెందిన తెలుగుదేశం నేత బొట్ట రమణ పరిస్థితిని స్థానిక వెల్ఫేర్ అసిస్టెంట్ మాధురికి తెలియజేసారు. ఆమె వృద్ధురాలి వద్దకు వచ్చేందుకు అంగీకరించడంతో ఆమెను పెదతాడివాడ తీసుకువెళ్ళారు. మంచంపై ఉన్న బొట్ట పైడితల్లికి వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛన్ అందజేసారు. వృద్ధురాలికి పింఛన్‌ను దాదాపు 25 కిలోమీటర్లు దూరంలో ఉన్న పెదతాడివాడకు తీసుకు వెళ్ళి ఇవ్వడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేసారు.

భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జాతీయ జంబూరిలో సోంపురం విద్యార్థులు

పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఏ రాజు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలో జరుగుతున్న భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జంబూరిలో పాల్గొంటున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా కమిషనర్ (అడల్ట్ రిసోర్సెస్) బీపీఏ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 సం.ల డైమండ్ జూబ్లీ జంబూరీలో నిర్వహిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా విజయనగరం నుండి

హాజరవుతున్న 49మంది విద్యార్థులుండగా, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి అడ్వాన్స్ స్కౌట్ ఉపాధ్యాయులు పీ.రమేశ్ నాయుడు ఆధ్వర్యంలో సేవాశ్రీ స్కౌట్ యూనిట్ విద్యార్థులు చైతన్య, సుధీర్, ఏర్నాయుడు, రోహిత్, అజయ్ శశివర్ధన్, అలాగే గైడ్ కెప్టన్ నాయిమున్నిసా ఆధ్వర్యంలో రుద్రమదేవి గైడ్ యూనిట్ విద్యార్థులు హాసిని, ధనుశ్రీ, మేఘన, హైందవి, స్వరూప పాల్గొన్నారని తెలిపారు. అలాగే జనవరి 28న జరిగిన ఈ ప్రారంభోత్సవ పేరెడ్‌లో విద్యార్థిలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాల్గొన్నారన్నారు. జనవరి28 నుండి ఫిబ్రవరి 3వరకు జరగబోయే ఈ కార్యక్రమంలో స్కౌట్స్ మరియు గైడ్స్ పలు అడ్వెంచర్, సైన్స్ ఫైర్స్, పెరేడ్, పయోనీరింగ్, సాంస్కృతిక కార్యక్రమాలలో తమ నైపుణ్యాలు ప్రదర్శిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఏ రాజు తెలిపారు.

ఘనంగా పరదేశమంబ తీర్థ మహోత్సవం

అలరించినఎడ్ల పరుగు పందెం, డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రం వేపాడ శివారు బక్కు నాయుడుపేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ పరదేశి మాంబ తీర్థ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు.ముందుగా అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు చేశారు.అలాగే తీర్థం పురస్కరించుకొని గ్రామస్తులు ఏర్పాటుచేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన చూపర్లను ఎంతో ఆకట్టుకుంది.ఈ పరుగు ప్రదర్శనలో ప్రథమస్థానం శ్రీ వీరాంజనేయ దేవరాపల్లి,ద్వితీయ తృతీయ స్థానాలలో శ్రీ మరిడిమాంబ వావిలపాడు,శ్రీ సిద్ధి వినాయక వేపాడ వారికి బహుమతులను అందజేశారు.అలాగే రాత్రి 9 గంటలకు నాయుడు ఈవెంట్స్ వారిచే ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం యువతను ఎంతో ఆకర్షించింది.ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ వేచలపు చిన వెంకటరామనాయుడు, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు,గ్రామ పెద్దలు వంటాకు భాస్కరరావు, చప్ప దేముడు, గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.